సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



'రేషన్' దందా గుట్టు రట్టు

రేషన్ బియ్యం, గోధుమలను నిల్వ ఉంచిన స్థావరంపై మంగళవారం అధికారులు దాడులు చేశారు. 8లో▸



ఆరోగ్యంపై శ్రద్ధ ముఖ్యం

విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ సూచించారు. 8లో▸



జీతాలు ఇవ్వాలి

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జూలై వేతనాలు మంజూరు చేయాలని పీఆర్టీయూ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని ఐలమ్మ

కలెక్టర్ శశాంక



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాయుధ రైతంగా పోరాటంలో చాకలి ఐలమ్మ విప్లవాగ్ని అని.. ఆమె అమరత్వం నేటి యువతకు ఆదర్శ ప్రాయమని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెట్టి చాకిరి విముక్తికి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. 1940–44 మధ్యకాలంలో విసునూర్‌లో దేశ్‌ముఖ్, రజాకార్ల అరచాకాలపై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశవ్ రామ్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.అజయ్, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి రూ.ఐదు లక్షల విరాళం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి ఎంఎస్ఆర్ సేవా సంస్థల అధినేత సోమిరెడ్డి నరేందర్ రెడ్డి మంగళవారం రూ.ఐదు లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇందుకు తన వంతుగా ఆర్థికసాయం అందజేస్తున్నానన్నారు.

గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

యాచారం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల(బాలుర) పాఠశాలలో 2024–25 సంవత్సరానికి గాను ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించామన్నారు. ఆసక్తి ఉన్న ఎస్సీ విద్యార్థులు సరూర్‌నగర్‌లోని కార్యాలయంలో బుధవారం దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఒరిజినల్ టీసీ, బోనోఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో పాటు నాలుగు పాస్‌ఫొటో సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

'హైడ్రా'తో అక్రమార్కులపై చర్యలు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తుర్కయంజాల్: హైడ్రా ఏర్పాటు చేసి ప్రభుత్వం అక్రమార్కులపై చర్యలు తీసుకుంటోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఈ నెల 25న ఇబ్రహీంపట్నంలో నిర్వహించ తలపెట్టిన హలో మత్స్యకార..చలో ఇబ్రహీంపట్నం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, కాల్వలను కబ్జాల బారి నుంచి రక్షించాలని.. మత్స్య కార్మికులకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.కొండల్, జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు రావ ఐమోని రాజు, నాయకులు చక్రపాణి, జంగయ్య, రాములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పోలీస్ అకాడమీలో పాసింగ్ అవుట్ పరేడ్ నేడు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో బుధవారం కంబైన్డ్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ అభిషేక్ బిష్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సాయంత్రం నిర్వహించే ఈ పరేడ్‌కు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవు తారని చెప్పారు. సీనియర్ అధికారులు, ప్రత్యే క సేవలందిస్తున్న అధికారులు పాల్గొంటారన్నారు.

జలం.. పుష్కలం



ఏకధాటి వర్షాలు, పోటెత్తిన వరదలు

- నిండు కుండల్లా జంట జలాశయాలు
- మత్తడి దూకుతున్న చెరువులు, కుంటలు
- భారీగా పెరిగిన భూగర్భ జలమట్టం
- మెజారిటీ మండలాల్లో పది మీటర్ల లోతునే నీటి ఆనవాళ్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నెల రోజుల క్రితం వరకు పాతాళానికే పరిమితమైన గంగమ్మ ఇటీవల కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలు, వరదలకు పైపైకి ఉబికి వస్తోంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌తో పాటు జిల్లాలోని ప్రధాన జలాశయాలన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. వాగులు,వంకలు పొంగిపొర్లుతూ.. చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి.దీంతో ఆయా చెరువులు, కుంటల దిగువ ప్రాంతాల్లో భూగర్భజల మట్టం భారీగా పెరిగింది. బోరుబావుల నుంచి నీరు పైకి ఉబికి వస్తోంది. మెజార్టీ మండలాల్లో ఐదు నుంచి పది మీటర్ల లోతులోనే నీటి ఆనవాళ్లు కన్పిస్తున్నాయి. బోరు, బావుల్లో సమృద్ధిగా నీరు కన్పిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు సన్నద్ధం అవుతున్నారు. చౌదరిగూడెం, ఇబ్రహీంపట్నం,యాచారం, కడ్తాల్,మంచాల మండలాల్లో భూగర్భజల మట్ట జూలైతో పోలిస్తే ఆగస్టులో మరింత లోతుకు పడిపోగా మిగిలిన మండలాల్లో అనూహ్యంగా పైకి రావడం గమనార్హం.

జంట జలాశయాల గేట్లు ఓపెన్

3.900 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉన్న ఉస్మాన్‌సాగర్‌లో ప్రస్తుతం 3.567 టీఎంసీలు నీరు ఉంది. ఇన్‌ఫ్లో 700 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 226 క్యూసెక్కులు కొనసాగుతోంది. 2.970 టీఎంసీల సామర్థ్యం ఉన్న హిమాయత్ సాగర్‌లో ప్రస్తుతం 2.488 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 1,200 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 320 క్యూసెక్కు లు కొనసాగుతోంది. ఎగువన ఉన్న ఈసీ, మూసీ వాగుల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో గేట్లు తెరిచి వచ్చిన నీరు వచ్చినట్లే కిందికి వదులుతున్నారు. దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. ఇళ్లను ఖాళీ చేసి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఎగువ ప్రాంతాలతో పాటు దిగువ ప్రాంతాల్లోని భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. రావిర్యాల పెద్ద చెరువు, ఇబ్రహీంపట్నం చెరువు, తుర్కయంజాల్ మాసబ్ చెరువు సైతం నీటితో కళకళలాడుతున్నాయి.

వర్షపాతం, భూగర్భ జలమట్టం ఇలా..

మండలం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)	జూలై (మీటర్ల లోతు)లో	ఆగస్టులో (మీటర్ల లోతు)
అబ్దుల్లాపూర్‌మెట్	375.3	9.65	8.19
ఆమనగల్లు	451.9	7.96	7.36
బాలాపూర్	372.3	9.59	8.32
చేవెళ్ల	438.6	13.81	12.32
చౌదరిగూడెం	372.6	14.99	16.25
ఫరూఖ్‌నగర్	378.1	12.50	11.50
గండిపేట్	321.6	9.69	9.41
హయత్‌నగర్	472.0	11.61	9.67
ఇబ్రహీంపట్నం	287.1	17.53	18.59
కడ్తాల్	272.6	13.57	14.00
కందుకూరు	278.1	8.40	8.01
కేశంపేట	394.3	7.23	7.61
కొందుర్గు	441.1	9.81	9.37
కొత్తూరు	337.0	13.89	13.98
మాడ్గుల	279.9	7.19	8.13
మహేశ్వరం	433.9	13.97	13.70
మంచాల	318.9	14.19	15.08
మొయినాబాద్	391.8	12.30	12.12
నందిగామ	468.4	9.03	7.99
రాజేంద్రనగర్	420.5	10.23	7.89
సరూర్‌నగర్	424.0	20.51	16.09
శేరిలింగంపల్లి	520.6	17.81	12.75
షాబాద్	327.0	13.60	13.49
శంషాబాద్	311.4	12.24	12.20
శంకర్‌పల్లి	597.6	13.79	11.34
తలకొండపల్లి	501.6	18.85	16.96
యాచారం	262.8	10.49	10.66

నిఘా నీడలో నిమజ్జనం

20వ తేదీలోగా ప్రక్రియ పూర్తి

- అలజడులకు పాల్పడితే ఉపేక్షించం
- సాక్షి ఇంటర్వ్యూలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



ఇబ్రహీంపట్నం: వినాయక నిమజ్జన శోభాయాత్ర ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సాగాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆకాంక్షించారు. గణపతి నిమజ్జనాల నేపథ్యంలో మంగళవారం ఆయన 'సాక్షి'ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న: డివిజన్ పరిధిలో ఎన్ని వినాయక మండపాలకు అనుమతి ఉంది?

ఏసీపీ: 1,281 గణేశ్ మండపాలకు అనుమతి తీసుకున్నారు. మూడు ఫీట్లకు తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలకు అవసరం లేదు. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో 298, ఆదిబట్ల పరిధిలో 318, మంచాల పరిధిలో 216, యాచారం పరిధిలో 212, మాడ్గుల పరిధిలో 142, గ్రీన్ సిటీ పీఎస్ పరిధిలో 95 మండపాలున్నాయి.

ప్రశ్న: నిమజ్జనాలు ఎప్పటి వరకు పూర్తవుతాయి?

ఏసీపీ: ఈనెల 20 లోపు వినాయక నిమజ్జనోత్సవాలు ముగుస్తాయి. ఈ నెల 15న 187, 16న 203, 17న 742 గణనాథులు నిమజ్జనానికి తరలుతారు. మిగిలినవి 20వ తేదీలోపు పూర్తవుతాయి.

ప్రశ్న: శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఏసీపీ: ప్రత్యేక బలగాలతో పకడ్బందీగా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. అల్లర్లకు పాల్పడితే వెంటనే గుర్తించేందుకు వీడియో చిత్రీకరణతోపాటు కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల ద్వారా ఊరేగింపును పరిశీలిస్తాం. శోభాయాత్రకు డీజేల అనుమతి లేదు. రౌడీషీటర్లకు ఇప్పటికే ముందస్తు కౌన్సెలింగ్ ఇచ్చాం. గ్రామాల్లో సమస్యలను సృష్టించేవారిని గుర్తించి.. వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెడుతాం. డీసీపీ సునీతారెడ్డి మండప నిర్వాహకులతో ఇప్పటికే సమావేశాలను నిర్వహించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలి. అలజడులకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించం. చట్టరీత్యా కఠినంగా వ్యవహరిస్తాం.

ప్రశ్న: నిమజ్జనం చేసే ప్రదేశంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

ఏసీపీ: చెరువులు, చెక్‌డ్యాంల వద్ద వినాయకుల నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా క్రేన్‌లను ఏర్పాటు చేస్తాం. విద్యుత్ లైటింగ్ సౌకర్యం, మెడికల్ ఫెసిలిటీ కల్పిస్తున్నాం. గోతులు పూడ్చేసి వాహనాలు సాఫీగా వెళ్లేలా రోడ్డు మరమ్మతులు చేపడుతున్నాం.

ప్రశ్న: ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఏసీపీ: ప్రధాన రహదారులపై, కూడళ్ల వద్ద ట్రాఫిక్, సివిల్ పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తూ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. అవసరమైతే ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తాం. ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకునే చర్యలపై సూచనలు, సలహాలు ఇచ్చాం. ఒక వరుసలో ఊరేగింపు మరో వరుసలో వాహనాల రాకపోకలు సాగేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మండప నిర్వాహకులు, ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏసీపీ: మండపాల వద్ద అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలి. విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. మండపాల వద్ద ఏర్పాటు చేసే దీపాన్ని గమనిస్తుండాలి. ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా ఆహ్లాదంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలి.

కొత్వాల్‌గా మళ్లీ వస్తానని అనుకోలేదు

- గణపతి అనుగ్రహంతో చవితి నాడు వచ్చా
- నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: తాను మరోసారి హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా వస్తానని అనుకోలేదని, గణనాథుడి అనుగ్రహంతోనే రెండోసారి కొత్వాల్‌గా పని చేసే అవకాశం వచ్చిందని సిటీ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. ప్రస్తుతం నగరంలో గణేష్ ఉత్సవాలు జరుగుతుండటంతో ఆ బందోబస్తు, భద్రత ఏర్పాట్లపై ఆయన దృష్టి పెట్టారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని 70 అడుగుల బడా గణేషుడిని దర్శనం చేసుకున్న సీవీ ఆనంద్.. మధ్య మండల పోలీసులు చేపట్టిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధ్య మండల డీసీపీగా ఉన్నప్పటి నుంచి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సుదర్శన్‌తో కలిసి పనిచేస్తున్నా. భక్తుడిగా, హైదరాబాదీగా ఉన్న నన్ను వినాయకుడే రెండోసారి సీపీగా రప్పించారు'అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.



పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కార్యాలయం

13న అవిశ్వాస బలపరీక్ష

క్యాంపునకు తరలిన పెద్ద అంబర్‌పేట కౌన్సిలర్లు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీకి చెందిన 17మంది కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. ప్రస్తుత చైర్‌పర్సన్‌కు చెవుల స్వప్నకు వ్యతిరేకంగా కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం అందజేశారు. ఇది పరిగనలోకి తీసుకున్న కలెక్టర్ శశాంక 13న అవిశ్వాస బలపరీక్షకు సమావేశాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. చైర్‌పర్సన్ రేసులో ఉన్న పండుగల జయశ్రీరాజు ఇప్పటికే రెండు సార్లు విఫలయత్నం చేశారు. మూడోసారి ఎలాగైనా మున్సిపల్ పీఠం దక్కించుకునేందుకు ఆమె పట్టుతో ఉన్నారు. ప్రస్తుతం చైర్‌పర్సన్‌గా ఉన్న స్వప్న తీరుపై పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉన్నారనే చర్చలున్నాయి. ఈ క్రమంలోనే స్వప్నను ఎలాగైనా పదవి నుంచి దింపి ఆమె స్థానంలో జయశ్రీని చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని ఆయా పార్టీల నేతలు చర్చించుకుంటున్నారు. క్యాంపునకు తరలిన కౌన్సిలర్లు సమావేశానికి నేరు హాజరవుతారని సమాచారం.

ఆ ముగ్గురు హాజరవుతారా..?

ప్రస్తుతం చైర్‌పర్సన్ స్వప్నకు ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డితో పాటు కల్వంచకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాకుండా జయశ్రీకి పరోక్షంగా మద్దతు ప్రకటించే అవకాశాలున్నాయని చర్చించుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి మోహన్ చంద్ర పర్గేన్
- ముగిసిన 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్'శిక్షణ




మాట్లాడుతున్న మోహన్ చంద్ర పర్గేన్

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని సీనియర్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్)అధికారి మోహన్ చంద్ర పర్గేన్ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్–తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్' ఓరియెంటేషన్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ శిక్షణకు యాద్రాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులతో పాటుగా ఆయా జిల్లాల డీఎస్ఓలు హాజరయ్యారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐఎఫ్ఎస్ అధికారి మోహన్ చంద్ర పర్గేన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతని.. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గాలి, నీరు, భూమి కాలుష్యం కాకుండా కాపాడాలన్నారు. అనంతరం విశ్రాంత భూగర్భ శాస్త్రవేత్త హరిసర్వోత్తమన్ మాట్లాడుతూ.. అర్బన్ డెవలప్‌మెంట్‌తో కోల్పోతున్న అటవీ సంపద గురించి వివరించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పర్యావరణ శాస్త్రవేత్త సాయిభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవ వైవిధ్యం, మట్టి మహత్యం, విత్తన, బొగ్గు సంరక్షణ, ప్రాధాన్యత అంశాలపై సమగ్రంగా వివరించారు. సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పర్యావరణ ఉద్యమకారులు సురేశ్‌గుప్తా చేనేత వస్త్రాలు, ఈత చాపల వాడకాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ వేత్త జేఎస్ఆర్ అన్నమయ్య, పర్యావరణ ఉద్యమకారులు సురేశ్‌గుప్తా, ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి, డీఎస్ఓలు శ్రీనివాస్‌రావు, దేవరాజు, సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్తలు ఉమా మహేశ్వర్‌రెడ్డి, రోహిణి శ్రీ వైష్ణవి, సీజీఆర్ కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, ఐఈఎస్ స్పెషలిస్ట్ అన్నమయ్య, అడ్మిన్ అను దీప్, ప్రోగ్రాం ఆఫీసర్స్ నగేశ్, రజనీకాంత్, లక్ష్మీప్రసన్న, హరితాదేవి, సీజీఆర్ ప్రతినిధులు శంకర య్య, రవి, వర్ధన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

రామకృష్ణ మఠం సేవలు ఎనలేనివి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కవాడిగూడ: యువత వ్యక్తిత్వ వికాసానికి రామకృష్ణ మఠం అందిస్తున్న సేవలు ఎనలేనివని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక జ్యోతి వెలిగించేందుకు రామకృష్ణ మఠం దశాబ్దాలుగా చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. మంగళవారం రామకృష్ణమఠంలో అంతర్భాగమైన వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెంట్ రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ.. నిరంతర అభ్యాసనతోనే పరిపూర్ణత సాధ్యమవుతుందని విద్యార్థులకు సూచించారు. 1893 సెప్టెంబర్ 11న చికాగో విశ్వవేదిక సాక్షిగా స్వామి వివేకానంద హిందూ ధర్మ గొప్పదన్నాన్ని చాటి చెప్పారని గవర్నర్ గుర్తు చేశారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం రామకృష్ణ మఠంలో నాటి రామకృష్ణ మఠం, మిషన్ జాతీయ సర్వాధ్యక్షుడు స్వామి రంగనాథానంద వివేకానంద ఇనిస్టిట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెంట్ విభాగాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇప్పటివరకు 20 లక్షల మందికి పైగా యువతకు వ్యక్తిత్వ వికాసం, యోగా, ధ్యానం, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్, మఠం జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి సుహితానంద, డెక్స్ పెరిటీ గ్లోబల్ వ్యవస్థాపకుడు శరద్ సాగర్, ఫ్యాకల్టీ సభ్యులు, వలంటీర్లు, వివిధ కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు శ్రీకాంత్

భూములపై హక్కులు కల్పించండి

- ఎమ్మెల్సీ కోదండరాంను కోరిన ఫార్మా భూ బాధితులు

యాచారం: టీజీఐఐసీ పేరిట రిజిస్ట్రేషన్ చేసిన పట్టా భూములను తిరిగి రైతులపై మార్చేలా కృషి చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మంగళవారం ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి విన్నించారు. నగరంలోని ఆయన నివాసంలో రైతులు కలిసి గత బీఆర్ఎస్ సర్కార్ ఫార్మాసిటీకి పట్టా భూములను బలవంతంగా సేకరించి రైతులకు సమాచారం లేకుండానే పట్టా భూములను టీజీఐఐసీ పేరిట మార్చేశారని.. పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేశారని వివరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు హైకోర్టుకు తెలిపేలా కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో మరో పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. పట్టా భూములను ఇవ్వాలని రెవెన్యూ అధికారులు రైతులపై ఒత్తిళ్లు తెస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు దార సత్యం, నేనావత్ శ్రీకాంత్, బందె రాజు, శేఖర్‌రెడ్డి, అనసూయమ్మ, వినోద్‌రెడ్డి, కానమోని గణేశ్, కల్లు కొండల్‌రెడ్డి, మధూకర్ రెడ్డి, శ్రీశైలం, సందీప్‌రెడ్డి, కవుల సరస్వతి, పల్లె వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



మాసబ్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

తుర్కయంజాల్: గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాసబ్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఇప్పటికే క్రేన్‌లను కూడా సిద్ధం చేశామని వివరించారు. భక్తులు సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

సంపులో పడి బాలుడి మృతి



అభిరాం (ఫైల్)

తలకొండపల్లి: అల్లారుముద్దుగా చూసుకుంటున్న తమ కుమారుడిని నీటి సంపు బలి తీసుకోవడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ హృదయ విదారక సంఘటన మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదర్‌పల్లికి చెందిన దుద్దు శేఖర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆయన చిన్న కుమారుడు అభిరాం(2) చెల్లితో కలిసి ఆడుకుంటున్నాడు. కొద్ది సేపటికే బాలిక ఏడ్చుకుంటూ ఇంట్లోకి వచ్చింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అభిరాం జాడ కోసం వెతికారు. ఎక్కడా బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి ఇంటి ముందు ఉండే సంపులో చూడగా అభిరాం అందులో పడి ఉన్నాడు. వెంటనే స్థానికంగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అభిరాం మృతి చెందాడు. శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నకిలీ వైద్యుడి అరెస్ట్

అంబర్‌పేట: అర్హత లేకపోయినా వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేట తిరుమల నగర్‌లో రాజ్‌కుమార్ అనే వ్యక్తి మిత్ర ఆసుపత్రి ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నాడు. మరో ఇద్దరు అర్హులైన డాక్టర్లతో కలిసి రాజ్‌కుమార్ నేరుగా వైద్యం చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి పోలీసులకు అప్పగించారు.

‘రేషన్’ దందా గుట్టు రట్టు

- 38.3 టన్నుల బియ్యం, 11.25 టన్నుల గోధుమలు స్వాధీనం
- ముందస్తు సమాచారంతో అధికారుల దాడులు



పట్టుబడిన రేషన్ బియ్యం, గోధుమల బస్తాలతో అధికారులు

శంకర్‌పల్లి: రేషన్ బియ్యం, గోధుమలను తక్కువ ధరలకు సేకరించి అధిక లాభానికి విక్రయిస్తున్న ముఠా గుట్టును రాష్ట్ర విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రట్టు చేశారు. అనంతరం మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్‌లో హైదరాబాద్‌కి చెందిన మహమ్మద్ ఇబ్రహీం అనే వ్యక్తి కొన్నేళ్లుగా రేషన్ బియ్యం అక్రమ దందా చేస్తున్నాడు. గ్రామాల్లో, రేషన్ డీలర్ల వద్ద తీసుకున్న రేషన్, గోధుమలను ఇంద్రారెడ్డినగర్‌లోని ఓ పశువుల షెడ్డులో నిల్వ ఉంచాడు. అనంతరం ఎక్కువ ధరకు మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాలకు వాటిని తరలిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం పక్కా సమాచారంతో రాష్ట్ర విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇంద్రారెడ్డినగర్‌లో నిల్వ ఉంచిన 38.3 టన్నుల రేషన్ బియ్యం, 11.25 టన్నుల గోధుమలను పట్టుకున్నారు. ఆ సమయంలో ఇబ్రహీం అక్కడ లేకపోవడంతో.. ఉన్న కూలీలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న సరుకులను చేవెళ్లలోని ప్రభుత్వ గోదాంకి తరలించి, మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దాడుల్లో రాష్ట్ర విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శశిధర్ రాజు, అంజయ్య, రఘునందన్, రవీందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పీడీయాక్టు నమోదు చేస్తాం

ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్మినా, తరలించిన వారిపై పీడీయాక్టు కింద కేసు నమోదు చేస్తామని పౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. ఇప్పటినుంచి నిరంతరం దాడులు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. అక్రమ దందా ఎవరు చేసినా ఉపేక్షించేది లేదన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్



సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

చేవెళ్ల: విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, హాస్టళ్లను సీహెచ్‌ఓ సంతోష్, డాక్టర్ వేదశ్రీ, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను తనిఖీ చేసి ప్రిన్సిపాల్ టీనావతిని అడిగి వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం కావటంతో హాస్టళ్లలో ఉండే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కిచెన్ షెడ్‌లు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కూరగాయలను తప్పనిసరిగా ఉప్పు వేసిన వేడినీటిలో కడిగి వంట చేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. వారానికి ఓసారి విద్యార్థులను పరిశీలించడానికి వైద్య సిబ్బంది వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీనావతి, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పండగలను ప్రశాంతంగా నిర్వహించాలి



గణేశ్ మండపంలో డీసీపీ రాజేశ్ తదితరులు

శంషాబాద్ డీసీపీ రాజేశ్

షాద్‌నగర్‌రూరల్: ప్రజలందరూ ఐక్యంగా ఉండి పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. మిలాద్-ఉన్-నబీ, వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఏసీపీ కార్యాలయంలో డివిజన్ పోలీసులతో డీసీపీ మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ, ముస్లింలు భిన్నత్వంలో ఏకత్వంగా ఉంటూ పండుగలను నిర్వహించాలన్నారు. మిలాద్-ఉన్-నబీ, వినాయక నిమజ్జనోత్సవాలకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక నిఘాను ఉంచినట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు. చెరువుల వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలను అలంకరించడంతో పాటు, క్రేన్‌లను అధికారులు అందుబాటులో ఉంచారన్నారు. మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకొని గణేశ్ నిమజ్జనం జరుపుకోవాలన్నారు. అనంతరం రాంమందిర్‌లోని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొబ్బిలి చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రాంకుమార్, ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమకు సహకరించండి



డీహెచ్‌ఎస్‌ఓను సన్మానిస్తున్న రైతు సంఘం నేతలు

తలకొండపల్లి: జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల(డీహెచ్‌ఎస్‌ఓ)శాఖాధికారి సురేశ్‌నాయక్‌ను రైతులు సన్మానించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయన నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పట్టు రైతుల సంక్షేమ అధ్యక్షుడు శక్రు నాయక్ ఆధ్వర్యంలో సభ్యులు డీహెచ్‌ఎస్‌ఓను కలిశారు. అనంతరం శక్రునాయక్ మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రోత్సాహక రూపకంగా రైతులకు అనేక రాయితీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ ముత్యాలు, మాజీ ఉప సర్పంచ్ రవి, రాజు, మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మొయినాబాద్: ముందు వెళ్తున్న రైతుల ఆటోను వెనక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తొలకట్టకు చెందిన ఊరడి శ్రీకాంత్ తన ఆటోలో మంగళవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన మల్లేశ్, ప్రభాకర్‌లతో కలిసి గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో మొయినాబాద్ దాటిన తరువాత రాధాస్వామి సత్సంగ్ కేంద్రం ముందు వెనక నుంచి వస్తున్న లారీ వేగంగా ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న శ్రీకాంత్ కాలు విరిగింది. ఆటోలో ఉన్న మిగతా వారికి సైతం గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శ్రీకాంత్ తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ చేతిలోంచి నగదు చోరీ

చేవెళ్ల: బస్సు ఎక్కుతున్న సమయంలో మహిళ చేతిలోంచి రూ.45 వేలను అపహరించుకుపోయిన సంఘటన చేవెళ్ల ఠాణా పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కావలి సావిత్రి బ్యాంక్ పని నిమిత్తం రూ.45 వేల నగదుతో చేవెళ్లకు వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌లో నిల్చుంది. అనంతరం బస్సు ఎక్కిన తరువాత ఆమె చేతిలో ఉన్న కవర్ కట్‌చేసి ఉండటంతో డబ్బులు దొంగిలించారని లబోదిబోమని వాపోయింది. దీంతో బస్సు దిగి చేవెళ్ల పోలీసులకు బాధిత మహిళా ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యం



మహ్మద్ ఇక్రం (ఫైల్)

పహాడీషరీఫ్: తండ్రి మందలించడంతో కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానా రాష్ట్రానికి చెందిన మక్సూద్ ఖాన్ కుటుంబం పదేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం పహాడీషరీఫ్‌కు వలస వచ్చి నివాసం ఉంటుంది. కాగా ఇతని చిన్న కుమారుడు మహ్మద్ ఇక్రం జేసీబీ డ్రైవింగ్‌కు వెళ్లకపోవడంతో మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఇక్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా లభ్యం కాలేదు. ఈ విషయమై మక్సూద్‌ఖాన్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

బీకేఎస్ నూతన కార్యవర్గం నియామకం



నూతన జిల్లా కార్యవర్గంతో నాయకులు

మొయినాబాద్: రైతుల సమస్యలపై నిరంతరం భారతీయ కిసాన్ సంఘ్ పోరాడుతుందని సంఘం జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. మండలంలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా సామ మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్, విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా నోముల గోవర్ధన్‌రెడ్డి, సహ కార్యదర్శులుగా సత్యనారాయణ రెడ్డి, జి.రవీందర్‌రెడ్డి, కోశాధికారి పెంటారెడ్డి, ప్రముఖులు జంగయ్య, కృష్ణగౌడ్, రాంచంద్రయ్య, శంకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాండు, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కృష్ణా, రాజశేఖర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పశుపోషణ శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా వారు రైతుల సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మండలాల వారీగా ఉన్న కమిటీలతో సమన్వయంగా ఉంటూ సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సంఘం సభ్యులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జూలై నెల వేతనాలు మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.గోవర్ధన్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌యాదవ్ మాట్లాడుతూ.. 2024 జూలై నెలకు సంబంధించిన ఉపాధ్యాయుల వేతనాలు నేటికీ బ్యాంకుల్లో జమ చేయలేదన్నారు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం అధ్యక్షుడు డాక్టర్ పరమేశ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోడలు కాపురానికి రావడం లేదని అత్త ఆత్మహత్య



మణెమ్మ (ఫైల్)

శంకర్‌పల్లి: కోడలు కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ అత్త బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మోకిల పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని టంగటూర్‌కు చెందిన మణెమ్మ(45), మల్లేశం దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కొడుకు ఉమాకాంత్‌కు నాలుగేళ్ల క్రితం ఇదే మండలం ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన లావణ్యతో వివాహం జరిపించారు. మూడున్నరేళ్ల వరకు బాగానే ఉన్న లావణ్య ఆరు నెలల క్రితం భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. కోడలిని తెచ్చేందుకు అత్తామామలు ఎంతగా ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మణెమ్మ మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీ కొట్టడంతో ఉద్యోగి దుర్మరణం

అబ్దుల్లాపూర్‌మెట్: అతివేగంగా వచ్చిన కారు విధుల్లో ఉన్న ఉద్యోగినిని ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన బస్వాపురం లలిత(45) హెచ్‌ఎండీఏలో ఉద్యోగం చేస్తోంది. ఆమె ఔటర్ రింగ్‌రోడ్డుపై తారామతిపేట వద్ద విధులు నిర్వహిస్తుండగా మధ్యాహ్నం 2.30గంటల ప్రాంతంలో ఘట్కేసర్ నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన లలితను 108 వాహనంలో పీర్జాదిగూడలోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె సాయంత్రం మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

డెంగీతో అక్క, తమ్ముడి మృతి

- సోదరి అంత్యక్రియల రోజు సోదరుడి మృత్యువాత



షాజియాషా మృతదేహం

పహాడీషరీఫ్: డెంగీ బారిన పడి అక్క, తమ్ముడు మృతి చెందారు. ఈ ఘటన జల్‌పల్లి మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన యూసుఫ్ షా పదేళ్ల క్రితం కుటుంబంతో వలస వచ్చి జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని వాదే ముస్తఫా బస్తీలో నివాసం ఉంటున్నారు. ఇతని కుమార్తె షాజియా షా(10), కుమారుడు మహ్మద్ అజాన్ షా(4) స్థానికంగా ఉన్న స్టాండర్డ్ మోడల్ స్కూల్‌లో చదువుకొంటున్నారు. వీరు పది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. రక్త కణాలు తగ్గిపోవడంతో సోమవారం బాలిక మృతి చెందింది. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తమ స్వస్థలం బీదర్‌కు తీసుకెళ్లారు. మంగళవారం అంత్యక్రియలు ముగిశాక కుమారుడు అజాన్ షాకు తీవ్ర జ్వరం వచ్చింది. అక్కడి ఆస్పత్రికి తీసుకెళుతుండగా బాలుడు మృతి చెందాడు. తల్లిదండ్రులు తీవ్ర జ్వరంతో అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు చిన్నారులు డెంగీ బారిన పడి మృతి చెందడంతో వాదే ముస్తఫా బస్తీ ప్రజలు కన్నీటిపర్యంతమయ్యారు. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో కూడా ఈ బస్తీకి చెందిన పలువురు డెంగీతో మృతి చెందారు.